# ఓడలూ - బళ్లూ

పదిన్నరకు కాప్టన్ జాన్సన్‌తో అప్పాయింటుమెంటు వుండటం వల్ల రంగారావు చాలా పెందలాడే అడావిడిగా ఆఫీసులోకి అడుగుపెట్టాడు. ఆఫీసులో గుమాస్తాలంతా కేకులుతింటూ, టీలు తాగుతూ, నానా అల్లరి చేస్తున్నారు. రంగారావును చూడగానే ఆఫీసంతా సద్దు మణిగింది. యుద్ధం కోసం ఏర్పరిచిన ఈ అభాగ్యపు డిపార్టుమెంటుల్లో చదువు సంధ్యల్లో మునిగి ఉండవలసిన కుర్రకారంతా చేరటం వలన పై ఉద్యోగి మీద గౌరవం ఉండటమనేది చాలా అరుదుగా వుంటుంది. కాని రంగారావెట్లాగో పనిచేసేవాళ్ల గౌరవానికి పాత్రుడు కాగలిగాడు. వాళ్లకెంత స్వేచ్ఛ ఇచ్చికూడా వాళ్ల భయభక్తులు సంపాదించుకున్నాడు. అతని అలవాట్లన్నీ గుమస్తాలందరికీ తెలుసు. అతను పెందలాడే వచ్చాడంటే త్వరలోనే మళ్లీ బయటికి వెళ్లుతాడన్నమాట.

అతను సీటులో కూచుంటుండగానే ఒక గుమస్తా కాగితాలన్నీ తెచ్చి ముందు పెట్టాడు.

"నాకు టైము లేదు. ముఖ్యమైన కాగితాలుంటే విడిగా తీసి పట్టుకురా" అన్నాడు రంగారావు, డయిరీ తిరిగేసి యెంగేజిమెంట్‌లు చూస్తూ.

"ఇంకో ఫైలింగు క్లర్కు కావాలనుకున్నాం. వచ్చి కనిపెట్టుకున్నాడు. చూస్తారా?" అన్నాడు గుమాస్తా.

"తరవాత, తరవాత" అన్నాడు రంగారావు పరధ్యానంగా, కాని గుమాస్తా కదలకపోవటం చూసి అది ముఖ్యమై ఉండాలని గ్రహించి "ఏడీ? లోపలికి పంపు, అప్లికేషను తెచ్చాడా?" అన్నాడు.

మరో క్షణంలో ఒక తెలుగు మనిషి – వాలకం చూస్తేనే స్పష్టంగా తెలుస్తున్నది – రంగారావు యీడువాడే లోపలికొచ్చాడు.

రంగారావు అతని మొహం కేసి చూడకుండానే, "ఏదీ అప్లికేషన్" అన్నాడింగ్లీషులో.

వచ్చినతను అప్లికేషనిస్తూ తెలుగులో, "మీరు మా ప్రాంతంవారే అని విన్నాను" అన్నాడు.

రంగారావును చెంపమీద కొట్టినట్టయి తల ఎత్తి చూశాడు. తెలుగువాడనే మిష

మీదో, తన ప్రాంతం నుంచి వచ్చిన వాడనే మిషమీదో ఉద్యోగం సంపాదించాలని అతని వుద్దేశమేమో అనే అనుమానం రంగారావు మనస్సులో ఒక్కసారి మెరిసి అతనికి కోపం తెప్పించింది.

"మీదే వూరు?" అన్నాడు రంగారావు అంతు చిక్కని కంఠస్వరంతో. అతను చెప్పాడు.

రంగారావు మొహాన ఎటువంటి మార్పులేదు. "మీ పేరు?" అంటూనే అప్లికేషను కేసి చూసి, "మీ పూర్తి యింటిపేరు?" అని ప్రశ్న మార్చాడు.

కొత్త మనిషి అది కూడా చెప్పాడు.

"మీ తండ్రిగారి పేరు?"

దానికీ వచ్చిన మనిషి సమాధానం చెప్పాడు.

రంగారావు తలవంచుకొని అప్లికేషను కేసి చూడసాగాడు.

"మీదేవూరు అడగొచ్చునా?" అన్నాడు ఉద్యోగం కోసం వచ్చినతను చాలా తియ్యగా.

రంగారావు సమాధానం చెప్పలేదు. కాని అప్లికేషను మీద ఒక చోట పెనసిల్‌తో గుర్తు పెట్టి "బియ్యే పరీక్షక్కూడా కూర్చొని యీ చిన్న వుద్యోగం దేనికీ? మాకు కావలసింది మామూలు ఫైలింగు క్లర్కు. ఏ స్కూలు ఫైనల్ తప్పిన వాడయినా చాలు. జీతం కూడా చాలా తక్కువ" అన్నాడు.

"చాలా చిక్కుల్లో వున్నాను. కుటుంబం కలవాణ్ణి. ఏ కాస్త దొరికినా చాలు. తరవాత మీ అనుగ్రహం వుంటే కాస్త పెద్ద వుద్యోగం సంపాదించగలనేమో!" అన్నాడు కొత్త మనిషి.

రంగారావు ఒక్కక్షణం ఆలోచించి అప్లికేషను మీద "ఫైలింగు క్లర్కుగా వేసుకోవటమయింది" అని రాసి సంతకం చేసి యీ లోపుగా తన గుమస్తా తెచ్చిపెట్టిన అర్జంటు కాగితాల మీద సంతకాలు చేసి, జవాబు రాసి, టోపీ పట్టుకొని గడియారం చూసుకుంటూ గబగబా వెళ్ళిపోయినాడు.

తన సంగతేమయిందీ తెలియక ఆదుర్దా పడే తెలుగాయన చల్లగా గుమస్తా దగ్గిరికి వెళ్ళి, "నా అప్లికేషనేమయింది?" అని అడిగాడు. ఆ గుమస్తా చెయ్యి చాస్తూ, "నీకు ఉద్యోగం యిప్పించేశాను. నాకేమిస్తావు?" అని దక్షిణదేశపు యింగ్లీషులో అడిగాడు.

"నిజంగానా?" అన్నాడు తెలుగాయన.

"ఇదుగో ఆఫీసార్డరు టైపు చెయ్యబోతున్నాను. కనీసం అందరికీ టీ యిప్పించాలి!"

గుమాస్తాలంతా పెద్ద గుమాస్తాను బలపరిచారు. అందరికీ టీలు ఆర్డరు చేయబడినై.

కొత్త గుమాస్తా పేరు కె.వి.ఎస్.డి.పి.రావు అనేది ఆఫీసులో తెలిసింది. జ్ఞాపకం పెట్టుకునేందుకు వీలుగా ఎ.బీ.సీ.డీ.ఎఫ్. రావని కొందరు నామకరణం చేశారు. మన పాలిటికి అతని పేరు ప్రకాశరావు.

ప్రకాశరావు కొొక కుర్చీ చూపించి ఫైల్సూ అవీ పరిచయం చేశారు. కాని అతనికిప్పుడే పనిలో మునిగిపోవాలని లేదు.

"ఈ రంగారావుదీ మాదీ ఒక వూరే!" అన్నాడు ప్రకాశరావు. అందర్నీ ఆశ్చర్యనిమగ్నుల్ని చెయ్యాలని అతని ఆశ. ఆ సంగతి గ్రహించి ఒకరిద్దరు, "ఓ, రియల్లీ" అన్నారు.

"అట్లా చెప్పు! అందుకనే అంత సులభంగా నీ కార్డరు పడింది!" అన్నాడు మీనన్.

"ఈ రంగారావు బ్రాహ్మడు కాడు!" అన్నాడు ప్రకాశరావు మరో బాంబు వేస్తున్నవాడల్లే.

"నువ్వో?" అన్నాడు మీనన్.

"నేనా? హఁ! నేను బ్రాహ్మణ్ణి!" అన్నాడు ప్రకాశరావు. ఆ సంగతి వాళ్ళకి సందేహం కలగటమే అతని కాశ్చర్యంగా వున్నట్టు కనపడ్డది.

"మనం బ్రాహ్మలమంతా చేరి ఒక అబ్రాహ్మడి కింద పని చెయ్యాలిసొచ్చిందే! ఎంత అన్యాయం!" అన్నాడు నాయరు.

మీనన్ నాయరుతో ఏకీభవించాడు.

ప్రకాశరావు విజయోత్సాహం పట్ట లేకుండా, "ఇదేం విన్నారు? ఇంకా వినండి!" అన్నాడు.

"చెప్పు చెప్పు!" అన్నారందరూ.

"ఈ రంగారావు తండ్రి రైతు .... మా పొలం చేసేవాడు!"

ప్రకాశరావు అందరి మొహాల కేసి ఆత్రంగా చూశాడు. ఆ మొహాల్లో అతనికి కావలసిన ఆశ్చర్యం కనిపించలేదు. ఆమాటే మళ్ళీ చెప్పాడు.

మీనన్ అకస్మాత్తుగా, "రంగారావు గారి తండ్రి పేరేమిటి?" అన్నాడు.

ప్రకాశరావు "నాగభూషణం" అని తడువుకోకుండా చెప్పాడు.

మీనన్ గబగబా రంగారావు గదిలోకి పరిగెత్తి మరో రెండు నిమిషాల్లో బయటికొచ్చి "నిజమే" అన్నాడు.

"నీకెట్లా తెలుసు?" అన్నాడు నాయరు.

"రంగారావు కొత్తగా కట్టిన పాలసీ ఆయన బల్లమీదే వుంది" అన్నాడు మీనన్.

"నేనబద్ధం చెప్పటం లేదు!" అన్నాడు ప్రకాశరావు గుమాస్తాల్లో కలిగిన మార్పుకు ఏమాత్రమో కంగారవుతూ.

"పాపం నీ ప్రారబ్ధం! మీ పొలం చేసిన వాడి కొడుకుకింద వుద్యోగం చెయ్యాలిసొచ్చింది!"

"మాలో ఓ సామెత వుంది. ఓడలు బళ్ళవుతై, బళ్లు ఓడలవుతై" అని ప్రకాశరావు ఇంగ్లీషులో అన్నాడు.

"ఆ సామెత కర్థం వున్నట్టే కనపడదేం?" అన్నాడు మరో గుమాస్తా.

"అర్థం యేమిట్లే! యుద్ధం ధర్మమా అంటూ అడ్డమైన వాళ్ళకీ పెద్ద పెద్ద వుద్యోగాలయినై" అన్నాడు ప్రకాశరావు ఏవగింపుగా.

"అవును మరి మనవంటి చవటలక్కూడా గుమాస్తాగిరీ దొరికింది!" అన్నాడు మీనన్.

తనను చూసి మిగిలిన గుమాస్తాలంతా ఎక్కిరిస్తున్నారేమో అనే సందేహం ప్రకాశరావుకు పొడమసాగింది.

"పెద్ద వుద్యోగాలు కావాలంటే శూద్రుడై పుట్టాలి. అందుకనే మీకూ నాకూ యీ గతి!" అన్నాడు ప్రకాశరావు అక్కసుతో.

ఆ గుమాస్తాలు ఒక్కసారిగా నవ్వారు. ప్రకాశరావు మరింత కంగారు పడ్డాడు. వాళ్ల వూళ్లో యీ విధంగా మాట్లాడితే యెంతో తెలివి గలవాడనుకుంటారు. ఈ పట్టణానికేం తెగులొచ్చినట్టు?

ప్రకాశరావుకు మరో సందేహం కూడా కలగసాగింది. వీళ్లంతా యీ రంగారావేదో గొప్ప వాడనుకుంటున్నారు. ఇతని పుట్టుపూర్వోత్తరాలు వీళ్లకేం తెలుసూ? గుమాస్తాలంతా యెగతాళి చేసినా సరే రంగారావును గురించి నిజం చెప్పేయాలనుకున్నాడు.

"మా పొలం చెయ్యటానికొచ్చినప్పుడు రంగారావు తండ్రికి సెంటు పొలం లేదు. పాతికేళ్లు మా పొలం మీద తెగబలిశాడు. రెండెకరాలు సొంతాన కొనుక్కున్నాడు. ఈ రంగారావుకు బియ్యేదాకా చదువు చెప్పించాడు. ఇవాళ ఈ రంగారావింత గొప్పవాడయి నాడంటే మా చలవే" అన్నాడు ప్రకాశరావు వుద్రేకంతో.

కొంచెం సేపెవరూ మాట్లాడలేదు.

"మరి నీకిదేం ఖర్మం? – ఈ గుమాస్తాగిరి" అన్నాడు నాయరు.

"చెబితినిగా? ప్రారబ్ధం! ఓడలూ బళ్లూ!"

"చాలా ఫైలింగు చెయ్యవలసింది వుంది. కానీ మరి" అన్నాడు మీనన్.

రంగారావు మధ్యాహ్నం దాటిన తరవాత గాని ఆఫీసుకు రాలేదు. అతను ఆఫీసుకొచ్చిన అరగంటకల్లా ప్రకాశరావుకు కబురు వెళ్లింది.

"కూర్చోండి, ప్రకాశరావుగారూ!" అన్నాడు రంగారావు.

ప్రకాశరావు కెందుకో కూర్చోవటానికి భయం వేసింది.

"యుద్ధం ధర్మమా అని నాకీ వుద్యోగం దొరికింది. ఇంతకు పూర్వం నేను చిప్పచేత

పట్టుకొని తిరిగినవాణ్ణి. మేం చాలా పేదవాళ్ళం. మా నాన్న చిన్నతనంలో చాలా స్థితిమంతుడు. ఒళ్లు కానక అంతా తగలేసుకున్నాడు. మేమంతా పుట్టుకొచ్చేటప్పటికి అంతా కరా రావుడయిపోయింది. తరవాత మా నాన్న మీ పొలం మక్తాకు తీసుకున్నాడు. మీ నాన్నగారా పొలంకేసి చూచిన పాపాన పోలేదు. ఊళ్లో రైతుపొత్తిడి జాస్తిగా వుండటం మూలాన మానాన్న చెవులుపిండి మీ నాన్నగారు గడ్డికూడా పూర్తిగా దక్కనీకుండా మక్తా బిగించాడు. మా నాన్నగారు కారం మెతుకులు తిని, మా కడుపులు మాడ్చి యిరవై యేళ్ళలోగా రెండెకరాలు కొనుక్కోగలిగాడు. కాని ఆయన తిండికి మాడుతూ అనేక రోగాలు తెచ్చుకుంటూ పసరు వైద్యాలు చేసుకుంటూ గాలికి పెరిగాడు. నా చదువంతా కులాభిమానుల చందాలతో సాగింది. నా తమ్ముడిప్పటికీ ఎందునా కాకుండా తిరుగుతున్నాడు. ఒకరిద్దరి పొలాలు చేసుకుంటున్నాడు. ఈ వుద్యోగం దొరికినంత మాత్రాన నేను గొప్ప వాణ్ణయి పోలేదు. మీరంటే పెద్ద కుటుంబంవారు. ఇవాళ చితికిపోయినా మీ గొప్పతనం తగ్గదు. మీరు నాకింద పనిచెయ్యటం నాకేమీ మనస్కరించదు. దాన్ని గురించే పొద్దుటి నుంచీ విచారిస్తున్నాను... ఏదైనా మీకు తగిన వుద్యోగం వెతుక్కోండి. నా చాతయిన శిఫార్సు చేస్తాను. మరోడిచేత అవసరమైతే చేయిస్తాను.... ఇది మరీ తక్కువ వుద్యోగం – మీనన్, రావుగారి నౌకరి తాలూకు ఆఫీసార్డరు పట్టుకురా, కాన్సిల్ చేసేస్తాను!" అన్నాడు రంగారావు.

***మొదటి ముద్రణ : నవోదయ, జనవరి 20, 1946***